సామాజిక న్యాయమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: విజయవాడంలో సామాజిక సమతా సంకల్ప సభకు బయలుదేరిన ర్యాలీని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సామాజిక న్యాయమే పరమావధిగా భారతదేశానికి మహోన్నత రాజ్యాంగాన్ని అందించిన స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడం సంతోషమన్నారు. అందరికి సామాజిక న్యాయమే అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మహాశిల్ప డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్నటు తెలిపారు. ఫిరంగిపురం మండలంలోని పలు గ్రామాల నుంచి 21 బస్సులు, 20 కార్లలో సుమారు 1,900 మంది అభిమానులు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, జి.చంద్రం, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, మేడాబాబు, డి.సురేష్, డి.మెల్కియా, ఎం.సురేష్, చేవూరిరామమోహన్‌రెడ్డి, బి.అంజిరెడ్డి, టి.కృష్ణ, సీహెచ్ చంద్రం, పి.చిన్న, ఎస్.చిన్నప్ప, పి.లక్ష్మయ్య, ఖాజావలి పాల్గొన్నారు.

అన్ని దారులు అంబేద్కర్ విగ్రహావిష్కరణ వైపే

తాడేపల్లిరూరల్: ఏ దారి చూసినా ప్రజలందరూ ఒకేవైపు వెళ్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నినాదాలతో విజయవాడ పయనమయ్యారు. తాడేపల్లి, దుగ్గిరాల మండలాల నుంచి భారీగా తరలివెళ్లారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణ పరిధిలో వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో భారీగా ప్రజలు విజయవాడ తరలి వెళ్లారు.



జెండాఊపి ప్రారంభిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి మేకతోటి సుచరిత,నాయకులు

మధ్యాహ్నం సమయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి భోజన సదుపాయం కల్పించారు.

పార్టీ ఉండవల్లి అధ్యక్షుడు దంటు గోవర్ధనరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కళ్లం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఆటోపై ఆవిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. దుగ్గిరాల మండల నుంచి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వి.రజనీకాంత్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఆయా కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎం.ప్రకాష్, ఎస్.మరియబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.డేవిడ్‌రాజు, ఎండీ గోరెబాబు, నాయకులు మేకా అంజిరెడ్డి, దర్శి రమేష్, సిహెచ్.సుబ్బారావు, బాలకోటయ్య, ఎలీషా, నాని, శ్రీనివాస్‌రాజు, మల్లేశ్వరరావు, తిరుమలేశ్వరరావు, మంద్రు మనోహర్, మధు, కళ్యాణ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిన ప్రజలు

మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్మృతివనం జాతికి అంకితం చేసిన కార్యక్రమానికి శుక్రవారం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. బస్సులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు జండాలు ఊపి ప్రారంభించారు.

తాడికొండ నుంచి..

తాడికొండ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ సభకు తాడికొండ నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లారు. బడేపురంలో బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సర్పంచి తోకల సరోజినీ, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, రాఘవరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. తాడికొండలో పార్టీ గ్రామ అధ్యక్షుడు షేక్ జుబేర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తుళ్లూరు మండలంలో జై భీమ్ నినాదాలతో స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం బస్సుల్లో ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు. సామాజిక న్యాయం, సాధికారతకు పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు, మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. విద్య, వైద్యం, రాజకీయంగా పేదలు, బహుజనులకు ఆయన వేసిన బాట భావితరాలకు పెట్టని కోటలా నిలిచిపోతుందని పేర్కొన్నారు.



మంగళగిరి హైవేపై జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి



తాడికొండలో జెండా ఊపి అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లి పట్టణ పరిధిలో 16 వార్డులో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మాజీ కౌన్సిలర్ సింకా గంగాధర్

అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు అద్భుతం

మంగళగిరి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన రోజు చరిత్ర మరువని రోజు అని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

ఆశయాలు అమలు



అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమ సమాజ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేయడం అభినందనీయం.

– జీఎస్ సుందరరావు, విశ్రాంత ఆర్ఐ

చరిత్రలో ప్రత్యేక స్థానం



సీఎం వైఎస్ జగన్ తన ఆశయం, లక్ష్యాలను మరోసారి అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో చాటి చెప్పారు. స్మృతివనం జాతికి అంకితం చేసిన శుక్రవారం చరిత్రలో నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

– కారుమంచి ప్రభుదాస్, పోస్టల్ ఉద్యోగి మంగళగిరి

బహుజనుల మనసుల్లో చిరస్థాయిగా..



అంబేద్కర్ స్మృతివనం జాతికి అంకితం చేసిన శుక్రవారం దేశ చరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచిపోతోంది. అంబేద్కర్ ఆశయాన్ని నెరవేర్చగలిగిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. దళిత సామాజిక వర్గాల మనస్సులలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

– గరికముక్కు డేవిడ్ ఎస్సీ ఎస్టీ రైట్స్ యాక్ట్ ప్రతినిధి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, పోలకంపాడు, నులకపేట ప్రాంతాల వినియోగదారులకు సహకరించాలని కోరారు.

పంచాయతీ ప్రణాళికపై శిక్షణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఫ్రంట్‌లైన్ కార్యకర్తలకు పంచాయతీ ప్రణాళికపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, ఎంపీడీఓ విలియమ్స్, ఈఓపీఆర్డీ నిర్మలలక్ష్మీకుమారి, సూపరింటెండెంట్ రవిబాబు, కార్యదర్శులు సత్యానంద్, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

తాడేపల్లి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను తాడేపల్లి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. చిర్రావూరు ఇసుక రీచ్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు చిర్రావూరు గంగానమ్మ గుడి సమీపంలో తనిఖీ చేసినట్లు చెప్పారు. ఎటువంటి బిల్లులు లేకుండా కాటూరి శేఖర్ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండడంతో అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

పలు గ్రామాల్లో కులగణన సర్వే

ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు కులగణన సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విలియమ్స్ తెలిపారు. గ్రామంలో ఇంటింటికి వలంటీర్లు, సిబ్బంది వెళ్లి ఇంటిలోని వారి వివరాలు సేకరిస్తారని చెప్పారు. సేకరించిన వివరాలు ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. ప్రతి కుటుంబంలో కులగణన పూర్తి చేసిన తరువాత వారితో ఈకేవైసీ పూర్తి చేస్తారన్నారు. అదే విధంగా 8 ఏళ్ల లోపు వారితో ఈకేవైసీ చేయించనవసరం లేదని పేర్కొన్నారు.

నేడు వేంపల్లి షరీఫ్ కథలుపై చర్చ

తెనాలి: ఊరు పేరునే ఇంటిపేరుగా చేసుకున్న రచయిత వేంపల్లి షరీఫ్ కథాసంపుటాలు జుమ్మా, టోపి జబ్బార్ పుస్తకాలపై శనివారం తెనాలిలో చర్చా వేదిక జరగనుంది. ముస్లింల అస్తిత్వ వేదనను ఆవిష్కరిస్తూనే మానవతా స్ఫూర్తిని రగిలించే, ఆయా సంపుటాల్లోని కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారంతో సహా పలు గౌరవాలు లభించాయి. ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో స్థానిక సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు నెలనెలా నిర్వహిస్తున్న మంచి పుస్తకంపై చర్చావేదికలో భాగంగా సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. సాహిత్య విమర్శకుడు సుంకర గోపాల్, సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి సత్యరంజన్, రచయిత లలితానంద్ చర్చలో పాల్గొంటారు. కథారచయిత వేంపల్లి షరీఫ్ తన స్పందనను తెలియజేస్తారు.

రాష్ట్రంలో అన్ని చోట్ల సమాజ్‌వాదీ పార్టీ పోటీ

మంగళగిరి: రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలలో సమాజ్ వాదీ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. నగర పరిధిలో కాజలోని పార్టీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధే ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండురంగయాదవ్, జాలాది విజయ,కోనా గురవయ్య, వేలూరు తేజావతి, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొడవర్రు శివాలయంలో స్వచ్ఛ భారత్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రులో బీజేపీ ఆధ్వర్యంలో శివాలయంలో స్వచ్ఛ భారత్ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట శివాజీ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు ఎంతో మేలు అని ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఓపీ నమోదు వివరాలు, మందులు అన్ని సక్రమంగా ఇస్తున్నారా లేదా అని ఆరోగ్య సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. కాగా శిబిరంలో 352 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వారిలో 55 మందికి వైఎస్సార్ కంటివెలుగు ద్వారా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు పి.ఎస్తేరురాణి, శ్వేత, సంధ్య, అల్తాఫ్, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, ఏఎన్ఎం లావణ్య పాల్గొన్నారు.



ప్రజలకు వివరిస్తున్న ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి శ్రావణ్‌బాబు

బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరం

రుణమంజూరుశాఖ ప్రారంభంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం నారాయణశర్మ

తెనాలి: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతూ వస్తున్న వివిధ సేవల ప్రాముఖ్యత, వాటి ఆవశ్యకతను ఖాతాదారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ ఇండియా జనరల్ మేనేజర్ ఓం నారాయణశర్మ సూచించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్థానిక కొత్తపేటలోని ప్రధాన శాఖ పైభాగంలో నూతనంగా ఏర్పాటుచేసిన రుణమంజూరు శాఖ (ఆర్‌ఏసీపీసీ)ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రక్షణశాఖ ఉద్యోగులకు వేతన ఆధారిత ఉచిత బీమా కింద ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఆర్మీ ఉద్యోగి జి.కృష్ణకు సంబంధించి, బీమా డబ్బు రూ.50 లక్షల చెక్కును మృతుడి మాతృమూర్తి జి.అంజనాదేవికి ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి తోడ్పడుతున్న ఖాతాదారులకు ధన్యవాదాలు తెలియజేశారు. స్టేట్‌బ్యాంక్‌లో అందుతున్న సేవలను ఖాతాదారులు తెలుసుకుంటూ, ఆయా సేవలను వినియోగించుకోవాలని కోరారు. బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, తెనాలి రీజినల్ మేనేజర్ ఎస్ఎల్‌కేఎంపీ ప్రసాద్, చీఫ్ మేనేజరు వి.జయభారతి పాల్గొన్నారు.



ఆర్మీ ఉద్యోగి తల్లికి చెక్కు అందజేస్తున్న జీఎం ఓం నారాయణశర్మ

యువతరానికి వేమారెడ్డి లోకనీతులు ఆదర్శం

మహాకవి యోగి వేమన జయంతిలో వక్తలు

తెనాలి: మహాకవి యోగి వేమారెడ్డి జయంతిని శుక్రవారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తల్లీ పిల్లల వైద్యశాలలో తల్లులకు పండ్లు పంపిణీ చేశారు. తొలుత యోగి వేమారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ట్రస్ట్ అధ్యక్షుడు కిక్కూరి చిన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పామరులకు సైతం అర్థమయేలా పద్యాలు చెప్పి, మెప్పించిన కవి వేమన అన్నారు. ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంతమైన విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమడ్చిన మహానుభావుడు వేమారెడ్డి అన్నారు. కార్యదర్శి సీహెచ్ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ ఆటవెలది ఛందస్సులోనే చెప్పిన వేమన పద్యాలు లోక నీతులుగా చెప్పారు. సమాజంలో ఆయన సృజించని అంశం లేదనీ, అన్ని సమస్యలను భిన్న కోణాల్లోంచి దర్శించి, ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో ప్రదర్శించారని గుర్తుచేశారు. ట్రస్ట్ సభ్యుడు బొంతు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట దోపిడీలను వేమారెడ్డి ఎలుగెత్తటమే కాకుండా విగ్రహారాధనను నిరసించినట్లు చెప్పారు. లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పారని అన్నారు. నేటి యువతరం వేమారెడ్డి చెప్పిన నీతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత ట్రస్ట్ నిర్వాహకులు వేమారెడ్డి జయంతిని ఏటా జనవరి 19న అధికారికంగా జరిపేందుకు జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యుడు కిక్కూరి వెంకట సత్యనారాయణరెడ్డి రూ.30 వేలు, తిరుమలరెడ్డి లక్ష్మారెడ్డి రూ.2500 విరాళంగా అందజేశారు. కీసరి వెంకట కృష్ణారెడ్డి, ఢాకా సాంబిరెడ్డి, గాదె బాలకృష్ణారెడ్డి, జడ్డు బాలకోటిరెడ్డి, కొండముడుగుల శ్రీనివాసరెడ్డి, మార్లెల వెంకటరెడ్డి, మూలె పద్మావతి, తుమ్మా సీతారామిరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, మాదిరెడ్డి తిరుమలరెడ్డి పాల్గొన్నారు.



వేమారెడ్డి చిత్రపటం వద్ద నివాళి

22న సిబార్‌లో ఉచిత వైద్యసేవలు

పెదకాకాని: ఇండియన్ ప్రోస్థోడాంటిస్ట్స్ (జనవరి 22)డే సందర్భంగా పేదలకు ఉచిత దంత వైద్యసేవలు అందించనున్నట్లు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ తెలిపారు. పూర్తిగాను, పాక్షికంగా పళ్లు లేనివారికి తీసి పెట్టుకునే పద్ధతిలో ఉచితంగా సెట్టు కడతామని చెప్పారు. కృత్రిమ పళ్ల సెట్ కోసం జనవరి 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు సిబార్ దంత వైద్య కళాశాలలోని కట్టుడు పళ్ల విభాగంలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డాక్టర్ జె. రవిరాకేష్ దేవ్ 9502067978, డాక్టర్ జి. ఫణికృష్ణ 9885342725ను సంప్రదించాలని తెలిపారు.

ఔషధాలపై అవగాహన అవసరం

ఏఎన్‌యూ: ఔషధాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా ఎల్‌బీకే(లాంగ్ బీచ్ కెమిస్ట్) సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గద్దె భానుప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల, సైన్స్ కళాశాల జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగాలు సంయుక్తంగా 'మోడ్రన్ డిసీజెస్ ఆర్ ద డ్రగ్స్ ఓన్లీ ఛాయిస్ యాన్ ఇన్‌ట్రడక్షన్ కాంప్లిమెంటరీ స్ట్రాటజీస్' అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు . ముఖ్య వక్తగా డాక్టర్ భాను ప్రసాద్ ప్రసంగిస్తూ ఇటీవల ప్రపంచాన్ని వణికించిన కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు వాడుతున్న ఔషధాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కరోనా తర్వాత బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, తగు సలహాలను ఇచ్చారు. డయాబెటిక్, గుండె సంబంధిత అనారోగ్య సమస్యలు ఉన్నవారు కాంప్లిమెంటరీ మెడిటేషన్ ద్వారా లబ్ధి పొందే విధానాన్ని వివరించారు. మరొక వక్తగా పాల్గొన్న అమెరికాకు చెందిన గద్దె ప్రసూతి మాట్లాడుతూ ముఖ్యంగా పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ శాతం అనారోగ్యానికి గురవుతున్నారని వారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ క్రమంలో ఔషధాలపై కనీస అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సదస్సుకు ఓఎస్‌డీ ఆచార్య కె. సునీత అధ్యక్షత వహించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రమీలారాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గంగాధరరావు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్‌లో ఒడిదొడుకులపై సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాక్ మార్కెట్‌లో ఒడిదొడుకులపై పెట్టుబడిదారులకు అవగాహన అవసరమని ఎంసీఎక్స్ మెటల్ అండ్ ఎనర్జీ సంస్థ ప్రతినిధి ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మహిళా సాధికారత విభాగ ఆధ్వర్యంలో మూలధన మార్కెట్లలో మదుపు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, మహిళా సాధికార విభాగ డైరెక్టర్ చల్లా వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, అధ్యాపకులు డి. కళ్యాణి, డాక్టర్ గోప శ్రీనివాసరావు, ఏ. బాజీబాబు, సీహెచ్. వేదవతి, ఎన్. మణికంఠ, వి. అభిలాష్, బి.అనిత, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సురభి ఆధ్వర్యంలో 'మాయాబజార్' ప్రదర్శన



తెనాలి: ప్రముఖ పౌరాణిక నాటక సంస్థ సురభి సమాజంచే ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో 'మాయాబజార్' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్స్ ఆర్ట్స్ థియేటర్ సంయుక్త నిర్వహణలో జరిగే ఈ ప్రదర్శన వివరాలను శ్రీసాయి సంతోషి నాట్యమండలి ఆర్గనైజర్ సురభి సంతోష్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రదర్శనకు ముందు కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహక సంస్థల బాధ్యులు తెలిపారు. భారీ సెట్టింగులు, సాంకేతిక నైపుణ్యంతో అనుభవజ్ఞులైన కళాకారులతో ప్రదర్శించే మాయాబజార్‌ను కళాభిమానులు తిలకించాలని కోరారు. ఆయా సంస్థల నాయకులు గరికపాటి సుబ్బారావు, ఆరాధ్యుల కన్నా, అయినాల మల్లేశ్వరరావు, లక్కరాజు లక్ష్మణరావు, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.